# హారిక



అతివినయంగా చెప్పాడు బంట్రోతు.

"అయ్యగారింకా వారంరోజుల వరకూ రావటానికి వీల్లేదని చెప్పమన్నారండి. అర్జంటు పను లున్నాయిట. వచ్చే బుధవారానికి తప్పక వస్తా నన్నారు."

వీణాధరికి యీ మాటలు వినగానే యెక్కడలేని వుడుకు మోతుతనం వచ్చింది. ఇవాళ ఆయన వస్తారని ప్రత్యేకం తనే స్వయంగా బంగాళాదుంపలు వేయించింది. ఆవడలు చేసి సిద్ధంగా వుంచింది. సాయంత్రం యే సినిమాకు వెళ్ళాలో ఆలోచిస్తుంటే యీ కబురు!

విసుగ్గా లోపలకు వచ్చేసి మంచంమీద పడుకున్న వీణాధరికి కొంచెంసేపట్లో పనిమనిషి ఒక కవరిచ్చింది. పై చిరునామా దస్తూరీ చూడగానే ఆ వుత్తరం రాజారావుదగ్గిరనుంచి అని అర్థమైంది వీణాధరికి. రెండునెలల క్రిందట తాను వ్రాసిన వుత్తరానికి యీనాడు జవాబు. కుతూహలంగా విప్పింది.

"వీణాధరీ!

నీ వుత్తరం అంది చాల్లాకాలమైంది. సమాధానం వ్రాయలేని నిస్సహాయ పరిస్థితిలో వున్నాను. నా కాలమంతా ఆసుపత్రిలోనే సరిపోతూంది. వివరంగా తరువాత వ్రాస్తాను.

ఇంతే,

రాజారావు."

చదువుతూండగానే, వీణాధరి చేతిలోంచి ఆ వుత్తరం జారి క్రిందకు పడిపోయింది. శరీరమంతా స్వేద బిందువులు క్రమ్ముకొన్నాయి. ఇటీవలే ప్రారంభమైన గుండె నొప్పి అధికమయింది.

రాజారావ్ హాస్పిటల్ లో వున్నాడా? అతనికి జబ్బుచేసిందా? ఎప్పుడూ కళకళలాడే, చిరునవ్వుతో వెలిగిపోతూ, తాను నవ్వి, పదిమందిని నవ్వించే, రాజారావు నీరసంగా హాస్పిటల్‌లో బెడ్‌మీద పడుకొని, నర్స్ ఇంజక్షన్ చేస్తుంటే ... ... ...

ఇంక ఆలోచించలేకపోయిందివీణ. తనేం చేస్తోందో తనకు తెలియకుండా, ఇల్లంతా, అనేకసార్లుకలయ తిరిగింది. ఏదో ఆవేదన గుండెలను పిండేస్తోంది. అశాంతి మనసును నిలవనీయటంలేదు. పడుకొని బలవంతాన కళ్ళు మూసుకొంది. కలకబారిన మనసు, కళ్ళముందుకు, ఏవో పీడాకారపు దృశ్యాలను తెస్తోంటే, దిగ్గునలేచి కూర్చుంది.

ఎలా ఉన్నాడు? అసలు బ్రతికే వున్నాడా? ఛీ! ఛీ! ఎట్లాంటిఊహలు. తానతని నింక చూడగలదా? గుండెలు ఝల్లు మన్నాయి. ఇంక తనను తాను నిగ్రహించుకోవటం బొత్తిగా సాధ్యపడలేదు వీణాధరికి. ఒకసారి స్వయంగావెళ్ళి రాజారావును కళ్ళతోచూస్తేనేగాని నిలువలేననుకొంది. త్వరగా సూట్‌కేస్ సర్దుకొని, రెండు మూడు రోజుల వరకూ రానని పనిమనిషితో చెప్పి రైలెక్కేసింది.

ఈపాటికి హాస్పిటల్లో రాజారావు ఎలాఉంటాడో? మంచంమీద కొనప్రాణంతో పడుకొని "వీణా?" అని కలవరిస్తుంటాడా?

ఈ ఊహ వీణాధరికి కళ్ళలో నీళ్ళుతెప్పించినా, వెంటనే దానిలోని అవాస్తవికతకు నవ్వొచ్చింది. భగవంతుడి దయవల్ల, రాజారావుకు అట్లాంటి పరిస్థితి రాకూడదు, కానీ, వస్తే "వీణా!" అని కలవరిస్తాడా?

వీణాధరీ, రాజారావూ, ఒకనాడు ఒకరకంగా ప్రేమికులే! వాళ్ళు విడిపోయారని అర్థమవుతూనేవుంది. కానీ, వాళ్ళు విడిపోవడానికి కారణాలు మాత్రం పాఠకులు ఊహించే అందమైన కారణాల్లో ఏ ఒక్కటీ

సి. ఆనందారామం



(3)

కాదు వాళ్ళు అత్యంత సహజంగా విడిపోయారు.

వీణాధరి, ఎంతో సంకోచంగా వ్యంగ్యంగా, తమ వివాహప్రస్తావన చేసినపుడు, రాజారావు తేలిగ్గా నవ్వేశాడు.

"వీణా! నాకు నువ్వంటే యిష్టం లేకపోలేదు. కానీ, పెళ్ళివిషయంలో నాకు చాలా ఆశలున్నాయి. చాలా డబ్బూ, అంతకంటే ముఖ్యంగా పలుకుబడీ, వున్నవారి అమ్మాయి, ఏదో అసాధారణమైన ఆకర్షణ, కనీసం చైతన్యవంతంగా నన్ను కవ్వించగలిగే పాటి తెలివితేటలు వున్న భార్య కావాలని కోరుకుంటు న్నాను. ఇందుకు నా అర్హత లేపాటి వనేది వేరే సంగతనుకో! అయినా, అర్హతలకూ, ఆశలకూ సంబంధమేమిటి ?"

ఈ మాటలు విన్న వీణాధరి నిర్ఘాంతపోలేదు. కనీసం ఆశ్చర్యాన్నిగూడా పొందలేదు. "జీవితం జీవించడానికి — చదవడానికి కాదు." అనే రాజారావు ఇలామాట్లాడటంలో అనుకోవలసిందేముంది?

దుఃఖాన్ని నిగ్రహించుకోవడానికి మాత్రం వీణాధరి పెద్ద ప్రయత్నమే చెయ్యవలసివచ్చింది,

ఏడవబోయే పెదిమలతో చిరు నవ్వునవ్వి "విష్ యు బెస్ట్ అఫ్ లక్" అని చెప్పి అతని జీవితంలోంచి వచ్చేసింది. తరువాత ఆదెబ్బనుంచి కోలుకోవడానికి వీణాధరికి చాలారోజులు పట్టింది. పిచ్చిపిచ్చిగా ఏవో ఆత్మహత్యా ప్రయత్నాలు కూడా చేసిందని చెప్పుకొన్నారు.

ఏమయితేనేం కాని, చివరకు వీణాధరి లక్షణంగా పెళ్ళిచేసికొంది. పెళ్ళికి రాజారావుకూడా వచ్చి వధూవరులకు తన శుభాకాంక్షల నందజేశాడు. ఆ తరువాతకూడా, వీణాధరి, రాజారావు నెన్నడూ మరిచిపోలేదు. అసలు మరిచిపోయే ప్రయత్నంకూడా చెయ్యలేదు. కాని, అతి ప్రయత్నంమీద తనను తాను సంస్కరించుకోగలిగింది—అవును. అతడు అసాధారణమైనవ్యక్తి. ఇదమిత్థమనరాని, ఏదో అపూర్వాకర్షణ అతనిలో వున్నమాట వాస్తవం: అట్లాంటి వ్యక్తిని ఆకట్టుకోవడానికికూడా అసాధారణమైన వ్యక్తులే వుండాలి. తా నతిసాధారణమైనది. అతని మనసులో స్థానాన్ని పొందడానికి ప్రయత్నించి ప్రయోజనం లేదు. తన అర్హతకు తగిన— ఇంకా యెక్కువగానే—ఫలాన్ని పొందగలిగిందితాను. రాజారావుతన ఆశ లన్నీ సఫలమయ్యేలాగ తాను కోరిన కన్యను వివాహమాడుతాడు గాక ! అతి ప్రయత్నంమీద వీణాధరి కళ్ళలో నీళ్ళు పూర్తిగా మాయమయ్యాయి. రాజారావు స్మృతి యిప్పు డామెకు దుర్భర విషాదాన్ని కలుగజెయ్యటంలేదు. అతని నొక ఆత్మీయుడైన స్నేహితునిగా భావించగలుగుతూంది. అట్లాంటి వ్యక్తి స్నేహాన్ని పొందగలగటం ఒక అదృష్టమని నమ్మగలుగుతూంది.





రైలు కాజీపేట చేరుకొంది. కాఫీ, టీ వగైరా కేకలతో వులిక్కిపడింది వీణాధరి. అరుణోదయ మవుతూంది. లేచి ముఖం కడుక్కుందామనుకొని లేవలేక బద్ధకంగా అలానే కూర్చుంది వీణ.

ఎన్నెన్ని రకాలుగాఆలోచిస్తూన్నా తిరిగి తిరిగి మనసు రాజారావు అస్వస్థతమీదికే మళ్ళుతూంది.

దాంపత్య జీవితంమీద గంపెడాశలు పెట్టుకొన్న రాజారావు అసలు పెళ్ళే చేసుకోలేదు. ఆ విషయం తా నెన్నిసార్లు ప్రశ్నించినా సరైన సమాధానం పొందలేకపోయింది అతని కలలబాల అతనికి సాక్షాత్కరించలేదో ? లేక తారసిల్లిన అపరూపసుందరి అతనిని తిరస్కరించిందో?ఏం జరిగిందోమాత్ర వీణాధరి ఊహించలేకపోయింది కారణాలేవైనా, ఇప్పటికీ అతడు జంట లేని ఒంటిగానే నిలిచిపోయాడు. పాపం! ఈనాడు వంట్లో ఇంత అస్వస్థతగా ఉన్నప్పుడు, ప్రేమగా అతని నాశ్వాసించే హస్తం లేదు. అతని కష్టసుఖాలను తనవిగా చేసికోగలిగే మరొక ప్రాణి లేదు. కనీసం, అతనికి సాధారణ సదుపాయాలు చూడగలిగే తోడు కూడా ఎవరూలేరు.

రైలులోమిగిలిన ప్రయాణీకులు చూస్తారేమోనని గబగబ కళ్ళు తుడుచుకుంది వీణాధరి.

తాను వెళ్ళబోయేటప్పటికి ఎట్లాంటి దృశ్యాలు ఎదురవుతాయో? ఎంత జబ్బులో ఉన్నాసరే, సజీవుడయి ఉంటే చాలు ! అతనిని తాను బ్రతికించుకో గలదు. అతని జబ్బు పూర్తిగా నయమయ్యేవరకూ అతని దగ్గరే ఉంటుంది. ఇట్లాంటి పరిస్థితులో అతని కర్మకు అతనిని వదిలివేయగలశక్తి తనకు లేదు. సంఘం, పరువు, ప్రతిష్ఠ, తన సంసారం యివన్నీ వీణాధరి మనసులోకి రాకపోలేదు. ఏది యెలా జరిగినాసరే, సంఘమంతా తనను దుమ్మెత్తిపోసినా సరే, తనకు పరువు–ప్రతిష్ఠ లేమీ మిగులకపోయినాసరే! తన సంసారం నాశనమయినాసరే, రాజారావును మాత్రం జబ్బులో వదిలి రాలేదు, అతడే పొమ్మన్నాసరే !

రిక్షా దిగిన వీణాధరికి కూనిరాగంతీస్తూ, తల దువ్వుకుంటూ రాజారావు యెదురయ్యేసరికి శిలాప్రతిమలా నిల్చుండిపోయింది. తలవని తలంపుగా వీణాధరిని చూసి రాజారావూ అంతే ఆశ్చర్యపోయాడు.

"నువ్వు.... నువ్వు ... ...బ్రతికే వున్నావా ?" విభ్రాంతితో అడిగింది వీణాధరి.

"దురదృష్టవంతుణ్ణి" నవ్వుతూ అన్నాడు రాజారావు. వీణాధరికి, తాను మాట్లాడిందేమిటో తెలిసివచ్చి నాలుక కరచుకొంది.

"నీ జబ్బేమయిందీ ?"

"ప్రాణం పోతుందంటే నా కంత భయంలేదుకానీ, జబ్బులు మాత్రం యిష్టంలేదు. కానీ, నీ రాకేమిటీ ? వస్తూనే యీ కుశలప్రశ్న లేమిటీ ? అలా కూర్చో! కాఫీ త్రాగావా ? ఏమైనా పైత్యం చేసిందా ?"

"పిచ్చెక్కింది. నాకు కాకపోతే






నీకు! ఆ వుత్తర మెందు కలా వ్రాశావ్?'

'ఏ వుత్తరం? నేను చచ్చిపోయానని వ్రాశానా?' ఆశ్చర్యంగా అడిగాడు రాజారావు.

వీణాధరి ముఖం యెర్రబడగా తల వంచుకుంది. రాజారావు యిలా నవ్వుతూ యధాప్రకారం కళ్ళబడే సరికి, అంతవరకూ రగిలిపోతున్న వీణాధరి హృదయం చల్లబడింది. అంతవరకూ తాను పొందిన అలసట అప్పుడనుభూతమై కుర్చీలో నీరసంగా వెనక్కు వ్రాలి "హాస్పిటల్‌లో వున్నానని, నాకు సమాధానంకూడా యియ్యలేని పరిస్థితులలో వున్నానని వ్రాశావు—గుర్తులేదూ? అది చదివి యెంత బాధపడుతున్నావోనని పరుగెత్తుకొచ్చాను" అంది.

'ఓ, అదా! నాకు పెద్దవుత్తరాలు వ్రాయాలంటే విసుగు! అసలు వుత్తరాలు వ్రాయాలంటేనే విసుగు. నీ బాధపడలేక నీకు సమాధానం వ్రాస్తాను. మా చెల్లెలు హాస్పిటల్‌లోవుంది. అందుకని నాకు తీరిక లేదని వ్రాశాను.

'హమ్మయ్య! దారిపొడుగునా యెంత బాధ పడ్డాననుకొన్నావ్!'

'నీ అమ్మ కడుపు చల్లగాముందే చెప్పావు. ఇంక ముందు నా కెంత పెద్ద జబ్బుచేసినా, పొరపాటున కూడా, నీకు వ్రాయను. అయినా, ఇలావచ్చెయ్యటమేమిటి? అన్నింటికీ, తొందరే నీకు! వీణాధరికి రోష మొచ్చింది.

'అంత కానిపనేం చేశాను నేను?'

'ఏది కాని పనో,|ఏది మంచిపనో, నిర్ణయించేవాళ్ళం మనం కాదు. మనకు శ్రమలేకుండా, కొందరు బుద్ధిమంతులా పని చేసిపెట్టేశారు. ఆ ప్రకారం నడవటమే మనవంతు. ఇప్పుడేడువు మొదలు పెట్టక, లోపలికెళ్ళి స్నానం అదీ చూసుకో! మా అత్తయ్యహాస్పిటల్‌కు వెళ్ళింది. తను వచ్చాక భోజనాలు చెయ్యవచ్చు. వంట అయిపోయిందనుకొంటాను.'

'ఇంకా ఏం ఏడుస్తానూ? దారిపొడుగునా ఏడ్చేశాను.'

'వెరీగుడ్! నన్ను బ్రతికించావు. స్నానాలగది అటుపక్క వుంది.'

రాజారావు స్నానాలగది చూపించాడు. వీణాధరి స్నానంచేసి వచ్చేసరికి, రాజారావు మేనత్త వచ్చేసింది. వీణాధరిని పైనుంచి క్రిందకు పరిశీలనగా చూస్తూ "ఎవరురా?" అంది.

"మనకు కావలిసినవాళ్ళు" నిర్లక్ష్యంగా జవాబిచ్చాడు రాజారావు.

ఆవిడ మరొకసారి వీణాధరి వంక గుచ్చి గుచ్చి చూసి లోపలకు వెళ్ళిపోయింది.

ఆమె వెయ్యబోయే ప్రశ్నా పరంపర ఊహించుకొని, వీణాధరిగుండెలు ఝల్లుమన్నాయి. జడ్జీముందరి ముద్దాయిలా వణికిపోయింది. "నేను రాత్రి రైలుకి వెళ్ళిపోతాను." అంది.

"రెండు రాత్రులు వరుసగా నిద్ర లేకుండా ఉండగలవా?"

"పరవాలేదు. బెక్సిడ్రిజర్సు చేసి కొంటాను."

"అయితే సరే! భోజనానికి రా! అత్తయ్యా! మా ఇద్దరికీ వడ్డించు."

"ఇద్దరికీనా?" ఆవిడ నొక్కి అడిగింది.

"ఆ! ఇద్దరికీ!" అంతకంటే దృఢంగా అన్నాడు రాజారావు.

వీణాధరి కుంచించుకొని పోతూంది. తాను చేసినదెంత అనాలోచిత కార్యమో, ఇప్పుడర్థం కాసాగింది.

"పోనీ. నువ్వు తినేసిన తరువాత నేనావిడతో తింటాను." అంది బెదురుగా.

"బాగుంది! నువ్వు మాచెల్లెలిని చూడడానికి రావా? ఇప్పుడు నేను హాస్పిటల్‌కు వెడుతున్నాను, నువ్వింతదూరం వచ్చింది దేనికి?"

వీణాధరి ఇంకేం మాట్లాడలేదు.

హాస్పిటల్‌కు వెడుతూ దారిలో వీణాధరి "మీ మేనత్తగారు ఏమేమి అడుగుతారోనని హడలిపోయాను" అంది,

"ఆవిడకా అవకాశం లేకుండా చేసానుగదా!"

"నిజంగా నన్ను రక్షించావు."

"నువ్వెందుకింత కంగారుగా వచ్చావు?"

"చెప్పానుగా! నీకే బాగులేదనుకొన్నాను. మతిపోయింది. ఉన్న దాన్ని వున్నట్లు వచ్చేశాను. పోనీలే! మీ చెల్లెల్ని చూసినట్లవుతుంది."

రాజారావు మనసు కరిగి పోయింది. తనకోసం, ఆమె అంత ఆవేదనతో వచ్చిందనేసరికి, సహజంగా ఆమెపట్లవున్న అభిమానం మరింత కాగా, ఆర్ద్ర స్వరంతో "పోనీలే! ఇలానయినా, నిన్ను చూశాను." అన్నాడు.

వీణాధరి ఏం మాట్లాడలేదు.

"ఇంకా యేమిటి విశేషాలు?" అన్నాడు రాజారావు.

"విశేషాలా? ఏమున్నాయ్! మా వారు క్యాంప్‌నుంచి నిన్న రావలసింది. వచ్చే బుధవారం వరకూ రానని కబురుచేశారు. ఎక్కడిపన్లో బాబూ?"

"అలాగా?(!)ఐతే, ఆయన తరచు క్యాంప్స్‌లో వుంటారన్నమాట!"

"ఆ! తరచూ వెడుతూనేవుంటారు. ఊళ్ళో వున్నప్పుడుమాత్రం యెంత సరదాగా వుంటారనుకొన్నావ్. వట్టి చిలిపి. ఎప్పుడూ యేదో అల్లరిచేస్తూనే వుంటారు. ఇంక సాయంత్రమయిందంటే యెక్కడికో ఒకచోటికి బైలుదేరతీస్తారు. తను క్యాంప్‌కెళ్ళినపుడు మాత్రం పిచ్చెక్కినట్లే వుంటుంది."

ఏదో లోకంలో వున్నట్టు చెప్పుకుపోతూంది వీణాధరి. ఆమె వాక్ప్రవాహానికి అడ్డు తగలకుండా "ఊ! ఊ!!" అంటున్నాడు రాజారావు.

"బయటనుంచి వస్తూనే "వీణా!" అంటూ కేకలు. పని వున్నా, లేకపోయినా "వీణా! వీణా!!" అని పిలుస్తూనే వుంటారు. ఒక్కొక్కసారి విసుగేస్తుంది. కానీ, ఒక్క క్షణం తను లేకపోయినా తోచదు. నాకు కొద్దిగా ఒళ్ళు వెచ్చగా వున్నా బెంబేలెత్తిపోతారు. ఇంక ఆ గాబరా, హడావుడి చెప్పలేం! మరీ అంత వెర్రేమిటో?"

భర్తృస్మృతులతో మధురంగా నవ్వుకొంది వీణాధరి. ఆమె ధోరణికి విస్తుపోతూ "గుడ్!" అన్నాడు అన్యమనస్కంగా రాజారావు.

వీణాధరి మళ్ళీ ప్రారంభించింది.

"మరీ పసిపిల్లాడి తంతు! తనకు కావలసినవికూడా తనకు తెలియదు. చివరకు తన ఆకలి తనకు తెలియదు. భోజనం సంగతి నేను గుర్తుచెయ్యాలి. మేజోళ్ళు నేను రెడీగా పెట్టాలి. ఏ ప్యాంట్ వేసుకోవాలో; ఏ షర్టు వేసుకోవాలో నేను తీసిపెట్టాలి. ఇంక ఫలహారం చెయ్యడానికి ఎన్నితిప్పలు పెడతారో చెప్పలేను. టిఫిన్ ప్లేటు ఒకవారకి పడేసి ఆసంగతి మరచిపోయి, మరోపనిలో మునిగిపోతారు ఆ ప్లేటు చేతిలోపెట్టుకొని, మూవింగ్ టేబిల్‌లాగ తనకూడా, కూడా తిరగాలి. లేకపోతే, రాత్రిదాకా దాని సంగతే మరచిపోతారు."

రాజారావుకు విసుగేస్తూంది "ఊ!" అన్నాడు మూలుగుతున్నట్లు—

వీణాధరి అప్పటికీ ఆపలేదు. ఆమె భర్తృపాదుల దివ్యగుణ సంకీర్తనంలో పరవశత్వం పొందుతోంది. రాజారావు పూర్తిగా వినటం మానేశాడు. ఎప్పుడైనా, అన్యమనస్కంగా, "ఊ" అనో, "ఆ!" అనో, "అలాగా!" అనో మాత్రం అంటున్నాడు. తన ధోరణిలో తాను చెప్పుకుపోతున్న వీణాధరికి, రాజారావు వింటున్నాడో లేదోకూడా పట్టినట్టులేదు—

రాజారావు చెల్లెల్నిచూసి, ఆమె దగ్గర తాను కొనితెచ్చిన పళ్ళనుంచి, కొంచెంసేపు సానుభూతిగా మాట్లాడి రాజారావు వెంటరాగా, హాస్పిటల్ నుంచి తిరుగుముఖం పట్టింది వీణాధరి. వచ్చేటప్పుడంతా వీణాధరి తన శ్రీవారి గురించి చెప్పిన విశేషాలు విని విని విసుగెత్తిన రాజారావు ఏదో మాట్లాడబోతుండగానే దారి పక్కన గులాబిపూలను చూసి వీణాధరి అందుకొంది.

"మావారికి గులాబిలంటే చాలా ఇష్టం. నాకు సన్నజాజులంటే ఇష్టం. నాకోసం సన్నజాజులుకూడా తెస్తారనుకో!— అయినా రోజూ ఇన్ని గులాబిలు కొని తీసుకువస్తారు. పువ్వులంటే, ఎంతో మమకారం. మాయింట్లో చిన్నతోట వుంది— ఆయన స్వయంగా?" ...

గడగడ మాట్లాడుతున్న వీణాధర నోరు గట్టిగా నొక్కి పారేద్దామన్నంత కసి కలిగింది రాజా

రావుకు. సభ్యత తెలిసినవాడు గనుక చచ్చినట్లు వీణాధరి మాటలు విన్నాడు. కనీసం విన్నట్లునటించాడు.

ఆ సాయంత్రం ఆమెను రైలెక్కించినతరువాత తాను ప్లాట్‌ఫారమ్ మీద నిలబడి రాజారావు "నువ్వు వెళ్ళేసరికి మీ వారు రారను కొంటానేం?" అన్నాడు.

"అవును … …రారు" దిగాలుగా అంది వీణాధరి.

"హమ్మయ్య! ఐతే నువ్విలా వచ్చినట్లు ఆయనకు తెలిసే అవకాశం లేదు" అన్నాడు రాజారావు.

వెంటనే వీణాధరి ముఖం జేవురించింది.

"ఎందుకు లేదూ? నేనే చెప్తాను. నే నేమంత ఘోరంచేశానని దాన్ని పరమ రహస్యంగా వుంచటానికి? మా వారికి నామీద సంపూర్ణమైన విశ్వాసం వుంది. నేను జరిగింది జరిగినట్టు చెపుతాను. ఒకవేళ వారికి తప్పనితోస్తే తోచనీ. వారు వేసే యే శిక్షైనా సంతోషంగా భరిస్తాను. ఒక పని చెయ్యటానికి సాహస మున్నప్పుడు ఫలితాల ననుభవించే ఓపిక కూడా వుండాలి. అంతేకాని ఆయన దగ్గిర నేనేందాచను."

రాజారావు విస్తుపోయాడు. మనసులో "నీ కర్మ" అనుకొని పైకి "మంచిది. అలాగే చెయ్యి" అన్నాడు.

అంతలో లైట్లు వెలిగాయి. వీణాధరి చటుక్కున తన మాంగల్యాలను తీసి కళ్ళ కద్దుకొంది. రాజారా వది చూసిచాలా ఆశ్చర్యపోయాడు. వీణాధరికిమాత్రం తా నేంచేస్తున్నదో తనకు తెలియదు. అదొక అసంకల్పిత ప్రతీకారచర్య. తరతరాలుగా రక్తంలో జీర్ణించుకుపోయిన ఒకానొక సంప్రదాయపు గుర్తు.

రైలు బిగ్గరగాకూస్తూ కదిలింది. వీణాధరి కనబడినంతసేపు చెయ్యి వూపి, వెనుదిరిగాడు రాజారావు.

వీణాధరి రాక, ఆమెరాకలోని ఉద్దేశ్యం, తీరావచ్చిన తరువాత ఆమె తీరూ, అంతా విచిత్రంగా అనిపించింది, రాజారావుకు. లైట్లు వెలగగానే, ఆమె తన మాంగల్యాన్ని కళ్ళ కద్దుకోవటంగుర్తుకొచ్చింది. అదృశ్యం మనసులో తలచుకోగానే, అతనికిలా అనిపించింది.


"వీణాధరి మనసు ఒక డోలిక లాంటిది. గాలి తాకిడికి డోలిక వెనుక ముందులకు ఊగినా, అది స్థిరత్వాన్ని పొందేదిమాత్రం, అది బంధింపబడినశాఖనాశ్రయించుకొనే! వీణాధరి మనసుకూడా, మాంగల్యాలనే సూత్రాలతో, ఆమె భర్త అనే కేంద్రానికి బంధింపబడింది. ఉద్వేగ ఝుంఝూమారుతా లామె మనసు నెటు వూపినా, చివరికామె తన భర్త నాశ్రయించుకొనే ప్రశాంతినిపొందుతుంది."

□□□





# అర్ధ రూపాయి



సాధారణంగా అజ్ఞానదశలోని పసి పిల్లకాయలు, నెత్తిన ఎఱ్ఱపాగా, చేతలో లాఠీ, కాళ్ళకి బూట్సు, వంటి మీద యూనిఫారం వేసుకొని సాక్షాత్కరించే పోలీసు జవానుల స్వరూపాలు చూచి భయపడడం అక్కడక్కడ కద్దు.